




*తెలుగు జానపద గీతాలకి, జనపద సంగీతానికి కొత్త ప్రాణం పోసిన విదుషీమణి ‘కళాప్రపూర్ణ’ శ్రీమతి అవసరాల(వింజమూరి)అనసూయాదేవిగారి గురించి ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన అవసరం లేదు. 92 సంవత్సరాల వయసులో ఆమె వ్రాసిన వ్యాస పరంపర ఇది. అనసూయదేవిగారి సుదీర్ఘ జీవనప్రయాణంలో ఆమె కలుసుకున్న ప్రముఖ వ్యక్తులతో తన పరిచయాల గురించి ఈ శీర్షికలో వివరిస్తున్నారు.*

## ఓలేటి వెంకటేశ్వర్లుగారు

గొప్ప గాయకులు. ఆంధ్రుల బడే గులామ్ ఆలీఖాన్ ఆకారంలోను సంగీతంలోనూ వీరు. వెంకటేశ్వరులు గారు, నేనూ ఒకే గురువు ‘సంగీత సామ్రాట్’ మునుగంటి వెంకట్రావు పంతులుగారి వద్ద సంగీతం నేర్చుకున్నాం. ఓలేటిగారు కూడా నాకు సోదరులే. అలాగ చెప్పడం నాకిష్టం.

ఓలేటి వెంకటేశ్వరులు గారిది నిండైన గాత్రం. నిండైన విగ్రహం కూడాను. వీరు పాడేటప్పుడు కళ్ళు మూసుకుని, తన పాటలో తానే తన్మయులై పాడేవారు. వీరి గొంతులో సంగతులు సునాయాసంగా పలికేవి. విజయవాడ రేడియో స్టేషన్ ఉచ్ఛస్థితి (పాపులారిటి)కి కారకులలో వీరు ముఖ్యులు.

వెంకటేశ్వరులు గారు క్లాసికల్ సంగీతమే కాక, లలిత సంగీతం కూడా మధురంగా పాడేవారు. ఆ రోజుల్లో ఎన్నో మంచి పాటలు వీరి నోటమ్మట విన్నాం. మా మామయ్య కృష్ణశాస్త్రి పాటలెన్నింటికో వీరు సంగీతం కూర్చి జీవం పోశారు. ఆ పాటల్లో నాకిష్టమైన పాట ‘కడచేనటే సకియా ఈ రాతిరి’ అనేది వారి శిష్యులు, నా అభిమాన గాయకులూ అయిన మల్లాది బ్రదర్స్ చేత, వారి అమెరికా కచేరీలో పాడించుకుని విని ఆనందించాను.

ఓలేటి వెంకటేశ్వరులు గారు కారణజన్ములు. అర్ధజీవితమే ముగించి అస్తమించారు. మరొక జన్మంటూ ఉంటే, భగవంతుని మరొక ఓలేటిని మనకిమ్మని కోరుకుందాం.

ఓలేటిగారు ఎక్కడో ఉండవలసిన వ్యక్తి. వీరికి తగిన గుర్తింపు రాక పోవడం, చిన్న వయస్సులో మరణించడం ఆంధ్రుల దురదృష్టం. వారిపాటల కేసెట్స్ సిడిలు కూడా దొరకక పోవడం బాగాలేదు. ఎవరైనా పూనుకుని, దొరికినంత వరకు వారి పాటలను బయటకు తీసుకురావాలని కోరుకుంటున్నాను.

●●●

## శ్రీ రంగం గోపాలరత్నం

ఆంధ్రుల అభిమాన గాయని శ్రీరంగం గోపాలరత్నం. నా అభిమాన గాయని గోపాలరత్నమే. ఆ అపురూపమైన 'హస్కీ' వాయిస్‌తో ఆమె పాడే పాట నాకు చాలా ఇష్టం. బాలమురళీకృష్ణ, పినాకపాణిగారు, బడేగులామ్ ఆలీఖాన్‌లాగ, సంగీతంలోని సప్తస్వరాలకు, ఇంకా నగిషీ చెక్కి అలంకరించి, ఆ మధురాతి మధురమైన సంగీతాలంకృత శిల్పాలను మనకిచ్చింది గోపాలరత్నం.

ఘంటసాల వెంకటేశ్వరరావుగారిలాగా గోపాలరత్నం కూడా ప్రసిద్ధి కెక్కిన విజయనగర సంగీత కళాశాలలో సంగీతమభ్యసించింది. తీర్చిదిద్దిన ఘనపునాదుల మీద నిర్మితమైంది ఈమె సంగీత సౌధం. ఈమె పాటలో వ్యర్థపదాలుండవు, అనవసరమైన సంగతులూ, టైమ్ వేస్ట్ ఆలాపనా ఉండదు. అన్నీ తగుపాళ్ళలో ఉండి తీర్చిదిద్దినట్టు ఉంటుంది. భావయుక్తంగా ఉంటుంది. అందుకే నాలాంటి వాళ్ళకిష్టం మరి.

హైదరాబాద్ రేడియో వారు నన్ను స్పెషల్ ప్రోగాములకి 5 ఫస్టుక్లాసులిచ్చి, మద్రాసు నుండి రప్పించేవారు. నేను 'ఎ'గ్రేడ్ సింగర్‌ని, మ్యూజిక్ కంపోజర్‌ని. లలిత సంగీతం, 'ఈ మాసపు పాట', 'భక్తి రంజని' నా మ్యూజిక్‌తో ఇతరులచేత పాడించవలసి ఉంటే, నాకు గోపాలరత్నాన్ని ఇవ్వండని ముందే అడిగేదాన్ని. ఆమెకు వీలు లేదంటేనే మరొకరి చేత పాడించడం. ఇలాగ రత్నాన్ని మనస్సులో పెట్టుకుని కనకాంగి రాగంలో సంగీతం కూర్చిన యశోధర విలాపం 'లేపనైనా లేపలేదే' ఇంతవరకూ మరెవరి చేతా పాడించలేదు.

●●●

## ఎమ్.ఎల్.వసంతకుమారి

మధురాతి మధురమైన గాయని, నాకు అత్యంత ప్రియమైన గాయని ఎం.ఎల్.వసంతకుమారి. ఈమె తల్లిగారు లలితాంగి, కాకినాడ సరస్వతీ గాన సభలో కచేరీ చేయడానికి వచ్చినపుడు ఈమె కూడా వస్తుండేది. అప్పుడు పరిచయం అయింది నాకు. వసంత కుమారికి పదేళ్ళుంటాయేమో! స్టేజ్ మీద వాళ్ళమ్మ పక్కన కూర్చుని తనూ పాడేది. అప్పటికే ఆమె పాటలో 'ఒరిజినాలిటి', 'క్రియేటివిటీ' కనపడేది. తల్లితో పాడుతూ, కొత్త సంగతులు వేసేది తల్లి వారిస్తున్నా కూడా. లలితాంగి రాగాలాపన చేస్తుంటే, ఒకప్పుడు తానందుకుని, రాగం కొత్త రకంగా పాడేది. ఈ అమ్మాయి పెద్దయాక, అందర్నీ మించి పాడుతుందని అందరూ అప్పుడే అనుకునేవారు. ఇది కాకినాడలో చాలా ఏళ్ళక్రిందట జరిగిన విశేషం.

కొన్నేళ్ళ తర్వాత మద్రాసులో, చిత్రపు నారాయణ రావుగారితో, గూడవల్లి రామబ్రహ్మంగారిదో జ్ఞాపకం లేదు, పిక్చర్ ప్రారంభోత్సవానికి వెళ్ళినపుడు వసంతకుమారిని కలిశాను. ఏదో పిక్చర్‌లో ప్లేబాక్ పాడుతున్నానని చెప్పింది. కొన్నాళ్ళ తర్వాత లలితాంగి పోయిన వార్త, వసంతకుమారికి పెళ్ళయినట్టూ విన్నాను.

వసంతకుమారి కచేరీలు చాలా పాపులర్‌గా ఉండేవి. ఏ సభలో పాడినా ఆడిటోరియం నిండిపోయేది. ఒక ఎమ్.ఎస్.సుబ్బలక్ష్మి, ఎన్.సి.వసంత కోకిలమ్, కచేరీలతో సరి సమానంగా తూగేవి ఈమె కచేరీలు కూడ.

మా ఇంట్లో ఏదైనా విశేషముంటే పిలిస్తే వచ్చేది వసంతకుమారి. ఆమె కూతురు శ్రీవిద్య అరంగేట్రమ్, త్యాగరాయనగర్, హబిబుల్లారోడ్‌లో ఉన్న నారదర్ శ్రీనివాసన్ ఇంట్లో జరిగింది. ఇటు నుంచి వసంతకుమారి అటు నుంచి నారదర్ శ్రీనివాసన్ - ఇద్దరూ పిలిచారు. డాన్సు చూశాక వసంతకుమారితో అన్నాను, "నీకూ నాకూ కూడా అందమైన, అమ్మాయిలను ఇచ్చాడు భగవంతుడని". ఆ తర్వాత శ్రీవిద్యను ఆమె నటించిన పిక్చరులోనే చూశాను.

కర్ణాటక నొటేషన్‌తో నేను రాసి ప్రచురించిన జానపద గేయాలు ఏడు పుస్తకాల్లో ఒకటి, వసంతకుమారి ఆవిష్కరించింది - ఇండియన్ ఫైన్ ఆర్ట్స్ వార్షిక కార్యక్రమంలో! అందులో 'పెళ్ళిపాటలు' వసంతకుమారి చేత రికార్డు చేయిద్దామనుకున్నాను కానీ కుదరలేదు. తర్వాత బాంబే సిస్టర్స్ చేత, ప్రియా సిస్టర్స్ చేత పాడించాను - 'సంగీత' రికార్డింగ్‌కి.

వసంతకుమారిని మదనపల్లి వెళ్ళే ముందు కలిశాను. చాలా 'డిప్రెస్డ్'గా కనపడింది. శ్రీవిద్య పెళ్ళిచేసుకుని వెళ్ళిందని చెప్పింది. ఆవిడ అనారోగ్య పరిస్థితి కూడా చెప్పింది. ఈ గాయని మరికొన్నాళ్ళు బ్రతికి ఉంటే బాగుండేది.

సంగీత మహా సముద్రంలో టైడల్ వేవ్ వసంత కుమారి.

●●●

## పద్మావతీ సాలిగ్రామం

ఈమె నా 76 ఏళ్ళ క్రిందటి స్నేహితురాలు. మేము ఇప్పటివరకూ మళ్ళా కలవలేదు. అప్పటి జ్ఞాపకాలు మాత్రం కళ్ళకు కట్టినట్టున్నాయి.

మొదటిసారి పద్మావతీ సాలిగ్రాంని 1938 లో బెజవాడ గోపాలరెడ్డిగారి పెళ్ళివిడిదిలో కలిశాను. పెళ్ళికి వచ్చిన అతిథుల్లో కవులు, గాయకులకీ పచ్చయ్యప్ప కాలేజ్ హాస్టల్ ఏర్పాటు చేశారు. పక్క పక్కనే మా గదులు. ఆ 5 రోజుల్లో మాకు మంచి అనుబంధం ఏర్పడింది. మేమిద్దరం దాదాపు ఒకే వయసు వాళ్ళం. నాలాగే ఇంకా పెళ్ళిచేసుకోలేదు.(అప్పటిమాట) సంగీతం పిచ్చి. వాళ్ళిలాగ పాడారు వీళ్ళిలాగ పాడారంటూ చర్చించుకునేవాళ్ళం. శాంతా ఆప్టే అంటే కోపం ఆమెకు. నాకు శాంతా ఆప్టే గొంతు, పాటా చాలా ఇష్టం. నేనెక్కడ పాడుతున్నా మా కుటుంబమందరూ వచ్చినట్టే, పద్మావతీ సాలిగ్రాంతో ఆమె కుటుంబం అందరూ వచ్చేవారు. ఎటొచ్చీ ఒకే తేడా. ఆమెకు ఒక తమ్ముడు దిల్ రుబా వాయించేవాడు, మరొక బ్రదర్ తబలా, తండ్రో, మేనమామో హార్మోనియమ్ వాయించేవాడు.

మా నాన్నగారు రికమెండ్ చేసి, కాకినాడ గానసభలో, చుట్టుపక్కల ఊళ్ళల్లో పద్మావతీ సాలిగ్రాం పాట కచేరీలు ఏర్పాటు చేయించారు. అప్పుడు వీరి కుటుంబం మా ఇంట్లోనే బస చేసింది. ఈమె అమ్మగారికి హిందీ, మరాఠీ తప్ప మరే భాష రాదు. మా అమ్మకు హిందీ రాదు. అయినా ఎంచక్కా మేనేజ్ చేసేవారు.

పద్మావతీ సాలిగ్రాం నాకు రెండు పురందర దాసు కీర్తనలు, 'ఉదరవైరాగ్యలిదూ', మరొక పాట, రెండు అభంగ్స్ 1.'అది బీజ ఏకలే', 2. 'పాండురంగధ్యాని' నేర్చుకున్నాను. నేను తిరిగి ఆమెకు 1. 'అవని అంతా పెద్ద అక్షయపాత్ర' 2. ఎటులనే నీ లీల కీర్తింతు' (ముల్తాన్ రాగంలో) నేర్పించాను. ఈ పాటలు అన్ని ఊళ్ళల్లోనూ పాడి ప్రశంసలు అందుకుంది. ఇవి రెండూ నే పెట్టిన మ్యూజిక్, హెచ్.ఎమ్.వి వాళ్ళకి రికార్డు చేసిన పాటలు. ఈ పాటలో ఒక చోట ఎన్నిసార్లు కరెక్టు చేసినా తప్పు పాడేది. 'పిలువ వచ్చిన వేళ తలుపు తీయకపోతే' - అని పాడడానికి 'పలువ వచ్చిన వేళ తలుపు తీయకపోతే' - అని పాడేది.

తెలుగువారికి ఆమె పాట మీద అభిమానం ఎక్కువ. 1940 'ఉషాపరిణయం' పిక్చర్ తీయించి ఈమెను హీరోయిన్‌గా వేయించారు. అందులో నీలంరాజు వెంకట శేషయ్యగారు అనిరుద్ధుడు.

పద్మావతీ సాలిగ్రాం తర్వాత గోఖలే గారిని పెళ్ళిచేసుకుని పద్మావతి గోఖలే అయింది. నేను గిరిగారిని పెళ్ళిచేసుకున్నాను. మా పెళ్ళిళ్ళు అయాక మేము మళ్ళా కలవలేదు.

ఈ మధ్య హ్యూస్టన్‌లో పండిట్ జస్రాజ్ శిష్యులు సుమనీ ఘోష్ పాట కచేరీకి వెళ్ళాను. వారితో సహవాద్యకారుడిగా వ్యవహరించిన హార్మోనిస్టు పద్మావతీ గోఖలే శిష్యులని తెలిసి, వారిని కలిసి పద్మావతీ సాలిగ్రాంని గురించి అడిగి తెలుసుకున్నాను. చాలా పెద్దదై, పుణేలో ఉందని చెప్పారు. నమస్కారాలు చెప్పమన్నా.

●●● *(కొనసాగింపు వచ్చేసంచికలో)*


Click here to share your comments on this article.